# కల్యాణి కల

★

బత్తులపల్లె పాండురంగారావు

రాత్రులప్పుడు కల్యాణికి బలేకలలు వచ్చేవి. కండ్ల కెందరు అబ్బాయిలే కనిపిస్తారు క్లాసులో కూడ ఇప్పుడు మగపిల్లలవైపు తానట్టే సూటిగా చూడలేదు ఏదో పుస్తకం అడ్డుపెట్టుకుని నవ్వుతూండే వుంగరాలజుట్టు వెంకటరమణను తీరిగ్గా చూస్తుంది. కాని వాడు వొట్టి రౌడీవెధవ ఓ సారి అన్నాడుకూడా, 'ఏం అలా చూస్తావని!' అప్పటినుండి కల్యాణికూడ పాపం వాడివైపు చూడలా కళ్యాణి కిప్పుడు పిల్లలతో గుజ్జనగూళ్లు ఆడుకోవాలని లేదు. కిటికీదగ్గర కూర్చోని వచ్చిపోయే కాలేజి స్టూడెంట్లను చూడాలనిఉంది. బావ అక్కయ్యలు రూములో తలుపేసుకుని ఏం చేస్తున్నారో చూడాలని ఉంది, సీతాకోక చిలుక పూవుమీద ఎలా కూర్చుంటుందో చూడాలని ఉంది, వెంకటరమణ—ఛా! గోపాల్ తన భుజంమీద చెయ్యివేస్తే తనెలా ఉంటుందో ఊహించుకోవాలని ఉంది. పట్నంలో చదువుతూన్న బావ ఫోటోను తన ప్రక్కనుంచుతే తనెలాగున్నదో అద్దంలో చూడాలని ఉంది,

కల్యాణిని వాళ్ళనాన్న సినిమాకు తీసుకెళ్లాడు. సినిమాను చూస్తున్నంతసేపు కళ్యాణికి చాల ఊహలు వచ్చాయి. హీరోహీరోయిన్ల కలియక తన్నెందుకో పులకరింతలు కలుగచేస్తుంది! తనే హీరోయిన్ అయివుంటే?— హీరోయిన్ మీద కల్యాణి కీర్ష్య వచ్చింది. ముందుసీట్లు కొత్తగా పెళ్ళయిన జంటలు తనకు పూరకే సినిమా కనిపించకుండా అడ్డువస్తున్నారు. ఒకచోటకూడ వాళ్లు కుదురుగ పొందేటట్టులేదు సినిమాకు బదులు వాళ్ళనే చూస్తూంది. తనప్రక్కన తన నాన్నకు బదులు బావ వుండివుంటే చాల బాగుండేవి తనూ వాళ్ళ మాదిరే!

కల్యాణికి కలవచ్చింది. కలలో-తట్టి తన్ను లేపాడు బావ! తాను పైకి లేచింది. ఎందుకు లేపాడో అడుగుదామనుకుంది కాని నోరు తెరవ గలిగితేగా. బావ తన్ను దగ్గరకు లాక్కున్నాడు తనేమి చేయలేకపోయింది. బావ తన్ను గట్టిగా తనచేతుల్తో బంధించేశాడు, అబ్బ! ఎంతో ఆనందంగా! తనే ఓ కాగితం ఐవుంటే ఈ పాటికి చిరిగిపోయేది బావ తనమొహం పైకెత్తాడు, తను బావకళ్ళల్లోకి ఓ నిమిషం చూచింది, మళ్లీ చూడలేకపోయింది కళ్లు మూసుకుంది. బావ తన్ను గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు. తనూ తనకు తెలీకుండా బావను ముద్దుపెట్టేసుకుంది—"ఏమే గాడిదీ ఇంకా లేవలేదు?" అంటున్న అమ్మకేక కళ్యాణి విని మేలుకుంది, తను ఇందాక అనుభవించిన సుఖం అంతా కలే అని తెలిసింది. ప్రక్కహోటల్లో "కలగంటి కలగంటి......" వినిపిస్తూంది,

కల్యాణికి ప్రక్కగదిలో తన అమ్మ నాన్న తనకు పెళ్ళి చేయాలనుకుంటున్నది వింది. తన కెందుకో అప్పుడే చేసుకోరాదనిపించిరేది. తన పెద్దక్క పెళ్లయిం తరువాత ఆడబిడ్డపోరు పడలేక బావిలో దూకింది. తన రెండోఅక్క నవిలి

అత్తగారి పోరు పడలేక గింజుకుంటుంది. అందుకు పెళ్లి చేసుకో రాదనిపించింది. కాని అప్రయత్నంగా బావపేరు రాసింది తను తోముతున్న తప్పేలాపై. బావ తన్ను పెళ్లాడితే ఇలాగా తాను అంట్లు తోముతూంటుందా? బావనే పెళ్లి చేసుకోవాలని పించింది. పక్కింటావిడ ఎప్పుడూ పెళ్లి కబుర్లే చెప్తూంటూంది. ఆమె వో రేడియో. ఆ రేడియోకు శ్రోత లిద్దరే. అందులో తానొకతె. మరొకతె ఆమూడో యింట్లో ఉండే పెళ్లిగాని కాలేజి అమ్మాయి. ఆ అమ్మాయితనకు చాల చాల విషయాలు చెప్పింది. వాళ్ల కాలేజీలో వాళ్ళు మొగవాళ్ళను లెక్కే చేయరట. మగవాళ్లు ఆడవాళ్లను చాలా అధ్వానంగా చూస్తున్నారట. ఈ కాలంలో వాళ్లు కటిక వాళ్ళట వాళ్ళకి అసలు హృదయం లేదట! —హృదయం లేందే మనిషి జీవించడన్న తన సైన్సుపాఠం జ్ఞప్తి కొచ్చింది మరింతమంది మగవాళ్లు ఎలా బ్రతుకుతున్నారో?—మగవాళ్లు తమ జాతిపైపు చూపిస్తున్న ఏహ్యాన్ని తను చాలా గర్హించింది మగవారిపై ఎక్కడలేని కోపం వచ్చింది. అప్పుడే అన్న అటుండేమాటలు వినవచ్చాయి—

"ఆడదంటే అన్నం వండి పెట్టడానికే అవతరించింది"-అని. చాలకోపం వచ్చేసింది. కళ్లు రాగి వర్ణాన్ని దాల్చాయి. తలపై కెత్తింది. ఎదుటే బావ ఫోటో- అయితే బావకూడ మగవాడేనే? ఆ అమ్మాయి చెప్పినమాట అబద్ధమని తోచింది. కళ్లు ఆ నిమిషానికే ఆనందంగా మారిపోయాయి. బావను దేవుడంత అందంగా ఎందుకు సృష్టించాడు. తను అద్దం దగ్గర పోయి కూచుకుంది. తనకేం లోటు. తాను బాగానే వుంది - వైజయంతీమాల కిమల్లే. మను సిగ్గుతో చూచుకుంది. వృద్ధిపొందుతూన్న వక్షాన్ని జూచుకొని. పవిట సర్దుకుంది. ఇంకా అట్టాన్నే అద్దంలో చూస్తూంది.

"పోస్టు" అన్నమాటలతో ఉలిక్కిపడింది. గబగబా పోయి అందుకుంది. పైన బావ దస్తూరి పోల్చేసుకుంది. బావ తాను సెలవలకి వస్తానని వ్రాశాడు. ఎందుకో ఆనందం ఆకాశాన్ని అందుకుంది. మళ్లీ ఒక్కసారి అద్దంలో చూచుకొని లేని సిగ్గుతో ఏమి తెలియనట్టు అమ్మకు జాబు ఇచ్చేసింది. బావ వచ్చింది వస్తూనే తను గబగబ పోయి గబుక్కున కౌగలించుకోవాలి ముద్దు పెట్టేసుకోవాలి- అని అనుకుంది. బట్టలుతుకుతూ అనుకొంది మళ్లీ చా! చా!! ఫ్రీని గదూ అలా గబుక్కున ఏదంటే అది చేసేదేనా? తనేమి పాశ్చాత్యస్త్రీయా?- మొహం బావకు చూపించకుండా దాక్కోని తిరగాలనుకుంది. అప్పుడు బావే తన్ను గురించి అడుగుతాడు అప్పుడు చాటుగా ఉండి వినవచ్చు, హోటల్లో అప్పుడే పెట్టాడు... "వస్తాడే మా బావ, ఢిల్లీనుంచి వస్తాడే ..... . అని, వాడికేలా తెలుసు ఈ కళ్యాణి మనస్తత్వం

బావ వచ్చినాడు, కళ్యాణి అక్కడెక్కడా కనిపించలా. బావ గొంతు వినిపిస్తూంది ఉగ్రాణం కొట్టులో ఉన్న కళ్యాణికి. తనెక్కడ అని అడుగుతున్నాడే- పోకూడదనిపించింది-కాని పోతూంది. "ఏం! బావా" అంది సిగ్గు దొంతరలతో. ఏమే మాట్లాడనే మాట్లాడవేం?" అంటూ బావ తన్ను కౌగలించేసుకున్నాడు - సిగ్గు! సిగ్గు!!— అబ్బ! పులకరింతలు - కళ్లుమూసేసుకుంది. అమ్మ ముఖంలో కాస్త విసుగు కనిపించింది కాని బావకేం తెలుసు తనుపెద్దపిల్ల నయ్యాననీ!!!— చేతులు వదిలేశాడు, బావ, స్వర్గంనుండి దిగింది కళ్యాణి. మళ్లీ బావకు కనిపించలా - తనతో

మాట్లాడనుగూడలే — తన్నుచూచిన సిగ్గుతో పోయేవాడు. బహుశా తను చేసిన తప్పు తెలుసుకున్నాడేమో?

బావ కర్చీఫ్ మీద పేరుకుడుతుంది కళ్యాణి రంగుదారంతో. రకరకాల బొమ్మలు కళ్ళముందు కనిపిస్తున్నాయి శ్రద్ధగా జాగ్రత్తగా ప్రేమగా రంగురంగుల దారాలతో రమ్యంగా "రఘు" అని కుట్టింది. ముద్దుపెట్టుకుంది ఆ పేరును. అబ్బ ఎంత బాగుంది ఆ పేరు, తన పేరు, ఆ పేరుతో కలిపితే మరీ బాగుంటుంది, కళ్యాణి మనసు కళకళలాడింది. బావ అమ్మతో మాట్లాడుతున్నాడు. బావ ఏమిటో చెప్తున్నాడు, ఏమిటీ?.. . "తనకు పెళ్లా? ఎవర్ని మాలతి నిచ్చా!!!". అయితే తనో-తన ప్రేమో !! భూమి తలక్రిందులైంది, కళ్యాణి మొహం కళావిహీనమైంది, వాళ్ళమ్మ మందహాసం చేస్తుంది, ఆ మందహాసమే కళ్యాణి మనస్సులో మంటలు గలిగిస్తున్నాయని మాత్ర హృదయానికేం తెలుసు? పరుగెట్టిపోయింది ఉగ్రాణం కొట్టులోకి కళ్యాణి, ఏడుస్తూ కూర్చుంది.

"ఏమే! ఏడుస్తున్నావ్?"—బావగొంతు వినిపించింది. "నిన్ను నవ్విస్తాగాని నా పెళ్ళికి రావడం "మరచిపోకేం" అన్నాడు. తను తలపైకెత్తలేదు, బావవెళ్ళిపోయాడు అతనికేంతెలుసు కళ్యాణి హృదయసీమలో తాను చిన్న విగ్రహంగా ఉన్నానని? ..... ..అతనికేం తెలుసు ఆ అమ్మాయి దుఃఖానికి తన పెళ్లే కారణం - అని .. .

కళ్యాణి అక్కడే నిద్రపోయింది. కలలో నవ్వుతూ కనిపించాడు క్లాస్‌మేట్ గోపాలం!!!...

★

# సిసలైన కమ్యూనిస్టు

సాయంత్రంవేళ ఓ కుర్రాడు గొడుగు వేసుకుని రోడ్డుమీద నడుస్తున్నాడు

ఎలక్ట్రిక్ స్తంభంకింద నుంచున్న మరోకుర్రాడు ఆదృశ్యం చూస్తూ నవ్వు ఆపుకోలేక పోయాడు పోనీ అని ఆకాశంవేపు చూచాడు, ఎక్కడా మచ్చుకేనా ఒక్క మేఘంలేదు.

ఐతే సాయంత్రంవేళ గొడుగెందుకు?

సందేహ నివృత్తికై ఆ కుర్రాణ్ణే అడిగాడు,

"గొడు గెందుకంటా వేమిటి? ఓ మూల హోరునవర్షం కురుస్తుంటే!"

"ఎక్కడా?"

"మాస్కోలో"